# భాజపా పాలకుల నిఖార్సైన విద్వేష ప్రసంగం

**రాజస్థాన్** రాష్ట్రంలోని బన్స్‌వారాలో 2024 పార్లమెంటు ఎన్నికలలో తొలి విడత పోలింగ్ పూర్తయిన రెండు రోజులకు (21-4-2024) దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం ఎన్నికల నియమావళిని పూర్తిగా ఉల్లంఘిస్తూ సాగింది. వేల మంది ప్రజానీకం ప్రత్యక్షంగా, లక్షలాదిమంది పరోక్షంగా చూస్తూ, వింటూ ఉండగా ఆయన చేసిన ప్రసంగం అది. ఇది భాజపా పాలకులకే కాక భారత ప్రభుత్వ అధికార యంత్రాంగానికి కూడా తాము వల్లె వేసే చట్టాల పట్ల ఇసుమంత నమ్మకం కూడా లేదని రుజువు పరుస్తోంది

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోపై మోడీ వ్యాఖ్యానిస్తూ, తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మన తల్లుల, చెల్లెళ్ల మంగళ సూత్రాలను కూడా గుంజుకొని వాటిని ముస్లింలకు కట్టబెడతారు. మనం కష్టపడి సంపాదించుకున్న వాటిని ఇతరులకు సమర్పించుకుందామా అంటూ మత విద్వేషాలను రెచ్చగొట్టారు.

పై ఆరోపణకు తగిన ఆధారం ప్రస్తుత కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో లేనందున 18 సంవత్సరాల క్రితం (2006) కాంగ్రెస్ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ జాతీయ అభివృద్ధి మండలి 52వ సమావేశంలో చేసిన ప్రసంగాన్ని వక్రీకరించి ఉదహరించారు. ఇలాంటి సమావేశాలలో దోపిడీవర్గాల నేతలు వల్లించే ఆదర్శాలు ప్రజల నిజ జీవితంలోకి రావని వారికి తెలుసు. నిజానికి అవే అమలు జరిగి ఉంటే దేశ పరిస్థితి నేటి దురవస్థలో ఉండేది కాదు.

ప్రస్తుత కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో దేశంలో పెరిగి పోతున్న అసమానతలను తగ్గిస్తామనీ, తాము అధికారంలోకి వస్తే రిజర్వేషన్లపై ఉన్న పరిమితులను మార్పు చేసి ఆయా సాంఘిక సమూహాల జనాభా ప్రాతిపదికన పంపిణీ చేసేందుకు కనీస చర్యలు చేపడతామనీ వాగ్దానం చేశారు. ఇలాంటి వాగ్దానాలకు ఎన్నో పరిమితులు ఉన్నాయన్న విషయాన్ని తెలియనివ్వకుండా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆడవారి మెడలో తాళిబొట్లతో సహా మొత్తంగా హిందువుల సంపదలను చొరబాటుదారులూ, అధిక సంతానం కనే వారూ అయిన ముస్లింలకు కట్టబెడతారని రెచ్చగొట్టే మతోన్మాద పూరిత ప్రసంగం చేశారు.

అమలు జరగని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రణాళికలలోని ఆదర్శాలను కూడా వక్రీకరించి, తన మత విభజన రాజకీయాలకు భాజపా నేత మోడీ నిస్సిగ్గుగా వినియోగించదలచుకున్నాడు.

ఇక్కడ ముఖ్యంగా గమనించవలసింది ఏమిటి అంటే పెరిగిపోతున్న సామాజిక అసమానతలను ఇసుమంత తగ్గించడానికి కూడా భాజపా పాలకులు సిద్ధంగా లేరు అని! అలాంటి ఆలోచనే, అమలు జరగని వాగ్దానమే అయినా సరే, అది పరమ దుర్మార్గం అని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేయటం!! అంటే బడా కుబేరుల ఆస్తులను ఇంకా ఇంకా పెంచడం, శ్రమ జీవులను మరింత పేదరికంలోకి దించటం అన్న తమ ప్రస్తుత విధానాలనే కొనసాగించదలచుకున్నారన్న మాట!

భారతదేశంలో ప్రతి వెయ్యి మందిలో 142 మంది ముస్లింలు ఉన్నారు. అంటే సుమారు 20 కోట్ల మంది అన్నమాట! వీరందరినీ చొరబాటుదారులు అనీ, అధికంగా సంతానాన్ని కనే వారనీ మోడీ అభివర్ణించారు. పేదరికానికి, వెనకబాటుతనానికి, నిరక్షరాస్యతకు అధిక సంతానంతో సూటి సంబంధం ఉంటుందని సామాజిక శాస్త్రజ్ఞులు నిర్ధారించిన అంశం.

అలాగే ముస్లింల వాస్తవిక జీవన స్థితిగతులను తెలుసుకుని ఒక నివేదికను సమర్పించమని కోరిన జస్టిస్ రాజేంద్ర సచార్, జస్టిస్ రంగనాథ మిశ్రాల విడివిడి కమిషన్లు నిర్ధారించిన దాని ప్రకారం ముస్లింలలో ఆర్థిక, సాంఘిక పరిస్థితులు దళితులతో సమానంగాను, కొన్నిచోట్ల అంతకంటే తక్కువగాను ఉన్నట్లు నిర్ధారించాయి. రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో వారి జనాభా నిష్పత్తికి సుమారు మూడవ వంతు మాత్రమే పొందుతున్నట్లు కూడా ఆ నివేదికలు చెప్పాయి. అయినప్పటికీ వారిలో అక్షరాస్యత పెరుగుతున్న క్రమంలో సంతానం పెరుగుదల రేటు తగ్గుతున్నట్లు కూడా గణాంకాలు చెబుతున్నాయి. (ముస్లిములు పిల్లలను కనడం దాదాపుగా హిందువులకు దగ్గరగా వుందని కేంద్ర హోంశాఖ ప్రకటించిన గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి-'ది హిందూ' సంపాదకీయం 23-4-24) నిజానికి అత్యధికులు శ్రమ జీవులుగా ఉన్న ముస్లింలకు అందుతున్న వాటా, వారి జనాభాతో పోల్చుకుంటే చాలా తక్కువ. అలాంటి వారికి ప్రభుత్వం వైపు నుంచి అందించవలసిన కొద్దిపాటి చేయూతను కూడా వారికి దక్కకుండా చేయడానికి భాజపా పాలకులు పూనుకున్నారు. అలా చేయకపోగా ముస్లింలపై విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం ఎంత అమానుషమైనది?!

భారత ముస్లిములు తరతరాలుగా మన నేల మీదే జీవిస్తూ ఉన్నవారు. కనుక మోడీ ప్రసంగం ఉద్దేశపూరితంగా ముస్లింలపై అపోహలను, అసూయలను, ద్వేషాన్ని నింపటానికి చేసిన ప్రయత్నం అని స్పష్టమౌతోంది.

అంతేకాక 'కాంగ్రెస్ వారిది అర్బన్ నక్సల్స్ ఎజెండా' అని కూడా మోడీ అన్నాడు. 175 సంవత్సరాల క్రితపు కమ్యూనిస్టు ప్రణాళిక ఆరంభంలో "అధికారంలో ఉన్నవాళ్లు ఏ ప్రతిపక్ష పార్టీనైనా కమ్యూనిస్టు అని నిందించకుండా వదిలారా?" అని ఒక వాక్యం ఉంటుంది. ఈన్నేళ్ల తర్వాత కూడా ఆనాటి ఐరోపా ఖండపు అభివృద్ధి నిరోధక పాలక వర్గాల స్వభావమే ఇంకా కొనసాగుతూ ఉందని నరేంద్ర మోడీ రుజువు పరుచుకోవటానికి ఉత్సాహపడుతున్నాడు. సామాజిక అసమానతలు తొలగాలి

అంటే, కష్టజీవులు తమ శ్రమశక్తికి అసలైన విలువను పొందాలి. ప్రజల సంపదలను కొల్లగొట్టడంలో బడా కుబేరులకు తాబేదారుగా వ్యవహరిస్తున్న, వేగంగా పెరిగిపోతున్న ఆర్థిక అసమానతలకు రాజకీయ సూత్రధారుడుగా ఉన్న నరేంద్ర మోడీకి, సామాజిక అసమానతలు తగ్గించాలని మాట్లాడే వాళ్ళందరూ కమ్యూనిస్టు భావజాలానికి చేరువగా ఉన్నట్లే లెక్క. సంపన్నులను ప్రసన్నం చేసుకోవడానికి సమానత్వ భావజాలాన్ని నిందించడం తన సేవా ధర్మాన్ని నిర్వర్తించటంలో భాగంగా చూడాలి గాబోలు!

నరేంద్ర మోడీకి ముస్లిం ద్వేష ప్రసంగాల చరిత్ర చాలా ఉంది. అలాంటి ప్రసంగాల గణాంకాలను పేర్కొంటూ "భారత దేశపు విద్వేష ప్రయోగశాల" శీర్షికతో వాషింగ్టన్ కేంద్రంగా నడిచే ఒక పరిశోధనా సంస్థ ఇలా ప్రకటించింది. "2023లో మొత్తం విద్వేష ప్రసంగాలు 668 నమోదు కాగా మొదటి ఆరు నెలల్లో 255, రెండవ ఆరు నెలలలో 413 నమోదు అయినాయని ప్రకటించింది. 6 నెలల్లోనే 63% పెరుగుదల కనిపించిందని పేర్కొన్నది. అది సరిగా 2024 ఎన్నికలకు కొద్ది నెలల ముందు కాలమని మనం అర్థం చేసుకోవాలి.

2014వ సంవత్సరంలో అధికారంలోకి రావడానికి అవినీతి లేని ప్రభుత్వాన్ని, అభివృద్ధి కేంద్రంగా నడిచే పాలనను అందిస్తామని భాజపా పాలకులు ప్రజలకు వాగ్దానం చేశారు. అధికారం సాధించిన దగ్గర నుండి మత విద్వేష పూరిత చర్యలు పెంచుకుంటూ పోవడమే కాక, 2019 పార్లమెంటు ఎన్నికల సందర్భంలో తామే కల్పించుకున్న పుల్వామా ఘటనలను ఆధారం చేసుకుని పాకిస్తాన్ ద్వేషాన్ని (అంతర్ గర్భితంగా ముస్లిం ద్వేషాన్ని) రెచ్చగొడితే తప్ప గెలవలేకపోయారు. మతోన్మాదపూరిత విద్వేష ప్రసంగాలు, అబద్ధాల ఫ్యాక్టరీ ప్రచారాలు, ప్రభుత్వ చర్యలు, దాడులు అనునిత్యం జరిపిస్తూ, పై నుండి, ఉన్మాదశక్తుల ద్వారా కింద నుండి రోజువారీ కార్యక్రమంగా సాగించుకుంటూపోయారు.

తమకు 370 పార్లమెంటు సీట్లు వస్తాయి, తమ కూటమికి 400 దాకా వస్తాయి అని ప్రగల్భాలు పలుకుతూ ఉన్న భాజపా ప్రభుత్వం, మొదటి విడత ఎన్నికలు పూర్తికాగానే మరింతగా మతవిద్వేష పూరిత ప్రసంగాలకు ఎందుకు పూనుకున్నట్లు? ఒకవైపున వివిధ సర్వేల ద్వారా ప్రజలు వెల్లడి చేసిన అభిప్రాయాల ప్రకారం నిరుద్యోగం, అధిక ధరలు, ఎలక్టరల్ బాండ్ల అవినీతి గురించి ఎక్కువ మంది ఆందోళన పడుతూ ఉంటే వాస్తవిక జీవన సమస్యల చర్చను పక్కదారి పట్టించడానికీ మత విద్వేష పూరిత వాతావరణాన్ని పెంచటానికే ఈ విద్వేషాల్ని వెళ్ళగ్రక్కు తున్నారు. ఇది నేటి ఫాసిస్టు తరహా భాజపాలకుల బలహీనతనే సూచిస్తుంది తప్ప బలాన్ని ఎంత మాత్రం కాదు.

**28-4-2024**

* * * * *